

క్రిప్టో మాయ.. సొమ్ము పాయె
క్రిప్టో కరెన్సీ మాయలో జనం ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. రోజూ వేలల్లో సంపాదన ఉంటుందని భావించి రూ.లక్షలు పెట్టుబడి పెట్టి నిండా మునిగిపోతున్నారు.

8లో



కిలో టమాట రూ.40
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.17, సరాసరిన రూ.26 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.1°/21.8°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. మధ్యాహ్నం నుంచి ఉక్కపోత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఘాటు తగ్గిన ఎండుమిర్చి
- ధరల పతనంతో రైతుల ఆందోళన


మార్కెట్‌లో మిర్చి క్రయ విక్రయాలు

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు అమాంతం తగ్గాయి. వారం కిందట రూ.19 వేలు పలికిన క్వింటా ఎండు మిర్చి శుక్రవారం రూ.15 వేలు మించి పలకలేదు. వర్షాల ప్రభావంతో ఎండుమిర్చి దెబ్బతినగా మార్కెట్‌లో ధర పడిపోయింది. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 176 మంది రైతులు 247 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకువచ్చారు. మొదటి రకం సరుకు క్వింటా రూ.15 వేలు, రెండో రకం క్వింటా రూ.14,500, మూడో రకం క్వింటా ఎండుమిర్చి రూ. 7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. వారంలోనే క్వింటాపై రూ.4 వేలు ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

22న బుక్కపట్నంలో జాబ్‌మేళా
పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన బుక్కపట్నంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ముక్బుల్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో పనిచేయాల్సి ఉంటుందని, విద్యార్హత ఆధారంగా నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 7981541994 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా
హిందూపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హిందూపురంలోని మహిళ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తెలిపారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఐటీఐ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు బెంగళూరు, పెనుకొండ, హిందూపురం తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని, విద్యార్హత ఆధారంగా రూ.13 వేల నుంచి రూ.19 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు బయోడేటాతో పాటు, ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకురావాలని, ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9966682246 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ ట్రోఫీ
అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ చరిత్రలో తొలిసారిగా ఆర్డీటీ సౌజన్యంతో అనంత క్రీడా గ్రామం వేదికగా ఆల్‌ఇండియా జోనల్ స్థాయి రాజమాత జీజాబాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ శనివారం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ఎం.డేనియల్ ప్రదీప్ తెలిపారు. ఈ నెల 23 వరకు సాగే టోర్నీలో మొత్తం 16 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటారు. అనంతపురంతో పాటు ఒడిశా, లడఖ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌లో సమాంతరంగా ఈ టోర్నీ ఆయా జోన్లలో జరుగుతుంది.

నవంబర్ 10 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
ప్రశాంతి నిలయం: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నవంబర్ 10 నుంచి 15వ తేదీ వరకు గుంటూరులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్‌కీపర్ టెక్నికల్, ట్రేడ్‌మెన్ డ్యూటీ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారు. సబ్జెక్ట్ ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల అభ్యర్థులు తప్పని సరిగా అడ్మిట్ కార్డులు తీసుకుని రావాలని ఉన్నతాధికారులు సూచించారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, అభ్యర్థులు ఏజెంట్లను నమ్మి మోసపోరాదన్నారు.



ఈ బహుళ అంతస్తుల భవనం ధర్మవరం చిన్నూరు రోడ్డులో నిర్మిస్తున్నారు. జీ+5లో నిర్మిస్తున్న ఈ భవనానికి 'అహుడా' అనుమతులు తప్పనిసరి. కానీ భవన యజమాని టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ ఉన్నతాధికారికి ముడుపులు ముట్టజెప్పి నిర్మాణ పనులు వేగవంతం చేశాడు. అందుకే కళ్లముందే అక్రమ నిర్మాణం జరుగుతున్నా...టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రమత్తు నటిస్తున్నారు.



ఇది ధర్మవరం సాయి నగర్ ప్రధాన రహదారిలో నిర్మించిన కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్. ఈ వాణిజ్య భవనానికి ఫైర్ అండ్ సేఫ్టీ సర్టిఫికెట్ మంజూరు కాలేదు. అయినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మామూళ్లు తీసుకుని అనుమతులు ఇచ్చేశారు. అత్యవసర సమయంలో లోపలి నుంచి బయటకు వెళ్లే మార్గం కూడా లేదు. పొరపాటున ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే జరిగే దారుణం ఊహించలేము.



ఈ భవనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఈ భవనం 10 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. వాస్తవానికి 7 సెంట్లు దాటితే 'అహుడా' అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ అధికారికి లంచాలు ముట్టజెప్పడంతో ఈ స్థలాన్ని ఇద్దరి పేర్లమీద రిజిస్ట్రేషన్ చేయించి అనుమతులు ఇచ్చారు. కనీసం పార్కింగ్ స్థలం కూడా లేని ఈ భవనానికి అనుమతులు ఇవ్వడం చూస్తే అవినీతి ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

అక్రమాలకు ప్లానింగ్

- ధర్మవరం మున్సిపాలిటీలో అవినీతి 'ప్రసాదం'
- టౌన్ ప్లానింగ్ విభాగంలో జోరుగా దందాలు
- అమ్యామ్యాలిస్తే అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్
- డబ్బులు ఇవ్వకపోతే నెలల కొద్దీ దొరకని అప్రూవల్స్
- 'అహుడా' పరిధిలోని భవనాలకూ స్థానికంగానే అనుమతులు
- మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న వైనం

ధర్మవరం: మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా అక్రమాలకు కళ్లెం వేస్తూ పట్టణవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తుంది. కానీ ధర్మవరం మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ విభాగంలోని ఉన్నతాధికారి ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డారు. పైసలిస్తే చాలు అక్రమార్కులకు అనుమతుల 'ప్రసాదం' పంచిపెడుతున్నారు. ఎడాపెడా అనుమతులిస్తూ భారీగా వెనకేసుకుంటున్నారు. ఏ ఫైలు ముందుపెట్టినా 'నాకేంటి' అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. అందుకే అన్నీ సక్రమంగా ఉన్నా సరే ముడుపులు చెల్లించకపోతే నెలల గడిచినా ఫైలు ముందుకు కదలని పరిస్థితి. ఎవరైనా గట్టిగా అడిగితే నానా కొర్రీలు పెట్టి ప్లాన్ అప్రూవల్ ఇవ్వరు. ఆయన అడిగినంత ముట్టజెపితే ఆగమేఘాల మీద అప్రూవల్స్ ఇచ్చేస్తున్నారు.



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ఒక్కో ఫైల్‌కు ఒక్కో రేటు..
టౌన్ ప్లానింగ్‌లోని ఆ అధికారి ఒక్కో ఫైలుకు ఒక్కో రేటు ఫిక్స్ చేశారు. 2 లేదా 3 సెంట్ల స్థలంలో భవనం నిర్మించుకునేందుకు అవసరమైన అనుమతులకు కనీసంగా రూ.30 వేలు దాకా ముట్టజెప్పాల్సిందే. అదే 5 సెంట్ల భవనం అయితే రూ.60 వేల నుంచి రూ.లక్ష దాకా ముడుపులు ఇవ్వాల్సిందేనని బాధితులు చెబుతున్నారు.

'అహుడా'తో పని లేదు..
ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో 7 సెంట్లకుపైగా విస్తీర్ణంలో ఏ భవనం నిర్మించాలన్నా అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే 'అహుడా' ఫీజులు ధర్మవరం మున్సిపాలిటీకి చెల్లించే మొత్తం కంటే 50 శాతం ఎక్కువగా ఉంటాయి. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారి భవన నిర్మాణ దారులకు బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. 7 సెంట్లకు మించి స్థలం ఉంటే దాన్ని ఇద్దరి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించి రెండు ప్లాన్‌లకు అప్రూవల్ ఇస్తారు. కానీ ఒకే భవనం నిర్మించేందుకు సహకరిస్తారు. ఇందుకు భారీగానే ముడుపులు తీసుకుంటారు.

ఎన్ని అంతస్తులకైనా అనుమతి..
ధర్మవరం మున్సిపాలిటీ అధికారులకు జీ+3 వరకు మాత్రమే అనుమతి ఇచ్చే అధికారం ఉంది. అంతకుమించి భవనం నిర్మించాలంటే అహుడా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి భవనాల అనుమతులను టౌన్ ప్లానింగ్ విభాగం తనిఖీ చేయాలి. అయితే పట్టణంలో 5 నుంచి 7 అంతస్తుల వరకు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం అటువైపు చూడటం లేదు. భవన నిర్మాణదారుల నుంచి టౌన్‌ప్లానింగ్ విభాగానికి భారీగా ముడుపులు ముట్టడం వల్లే వారు ఆ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి.

వారధిలా ఎల్‌టీపీలు..
అవినీతితంతులో భవన యజమానులకు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు మధ్య వారధిలాగా ఎల్‌టీపీలు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఓ మహిళా ఎల్‌టీపీ రాయ'బేరం'లో కీలకభూమిక పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తనకు అధికార పార్టీ అండ ఉందని చెప్పుకుంటూ ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. వీరంతా కలసి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

అక్రమాలను ఉపేక్షించం



అవినీతికి ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదు. మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకుంటాం. అన్నీ సక్రమంగా ఉంటే అవినీతికి తావు లేకుండా సత్వరం ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేలాగా చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికే నిర్మించిన భవనాల యజమానులకు నోటీసులిస్తాం. – ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం


చిత్రావతి నది కాజ్‌వేపై పారుతున్న వరదనీరు


కొత్తచెరువు వద్ద ప్రవహిస్తున్న వంగపేరు

25 మండలాల్లో వర్షం
పుట్టపర్తి అర్బన్: అల్పపీడనం ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకూ జిల్లాలోని 25 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కదిరిలో 60 మి.మీ, ముదిగుబ్బలో 50.8 మి.మీ వర్షపాతం నమోదైంది. గాండ్లపెంట 37.8, బత్తలపల్లి 34.6, ఓడీచెరువు 28.6, రామగిరి 28, నల్లమాడ 26, ఎన్‌పీ కుంట 25, పెనుకొండ 18.4, నల్లచెరువు 18.2, తనకల్లు 15.6, అమడగూరు 13.4, కొత్తచెరువు 12.8, బుక్కపట్నం 12.4, రొద్దం 12, తాడిమర్రి 10.2, పుట్టపర్తి 8.6, తలుపుల 7.4, కనగానపల్లి 6.2, సీకేపల్లి 6, మడకశిర 4, సోమందేపల్లిలో 4, ధర్మవరం 3.8, హిందూపురం 2.6, అమరాపురం 1.6 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. ఈ నెల 22వ తేదీ మరో తుపాను ముప్పు పొంచి ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా వర్షాలతో చిత్రావతిలో నీరు చేరింది. పెడపల్లి వద్ద ఆర్డీటీ కాజ్‌వేపై నీరు పారుతోంది. గాజులపల్లి చెరువు మరువ పారుతుండగా... వంగపేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

184 హెక్టార్లలో పంట నష్టం
తాజా వర్షాలతో జిల్లాలో 184 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. ఇందులో వేరుశనగ 116 హెక్టార్లు, వరి 33 హెక్టార్లు, కంది 14 హెక్టార్లు, పత్తి 10 హెక్టార్లు, కొర్ర 6 హెక్టార్లు, సాములు 2 హెక్టార్ల చొప్పున మొత్తంగా 184 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.

బత్రేపల్లి కనువిందు
బత్రేపల్లి జలపాతం కనువిందు చేస్తోంది. తలుపుల మండలంలోని కదిరి–పులివెందుల మార్గంలోని బత్రేపల్లి అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పైనఉన్న మునీశ్వర కుంట నిండిపోయింది. అక్కడి నుంచి నీరు పరవళ్లు తొక్కుతూ బత్రేపల్లి జలపాతం నుంచి కిందకు దూకుతోంది. ఆ దారి వెంట వెళ్లే జనం ఈ అద్భుత దృశ్యాన్ని చూసి మైమరచిపోతున్నారు. సెల్‌ఫోన్లలో జలపాతం హొయలు చిత్రీకరిస్తూ ఆనంద పడుతున్నారు.
– తలుపుల


జాలువారుతున్న బత్రేపల్లి జలపాతం


అన్న చెప్పాడు.. ఆక్రమిస్తున్నాం!

- దళితుల శ్మశానానికి ఎసరు
- టీడీపీ చోటా నాయకుల బరి తెగింపు
- పరిటాల సిద్ధార్థ్ పేరుతో కబ్జా

రాప్తాడురూరల్: కాదేదీ కబ్జాకు అనర్హమన్నట్టుగా రెచ్చిపోతున్నారు టీడీపీ నేతలు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూములు, స్థలాలు, చివరకు ప్రైవేటు ఆస్తులను సైతం కబ్జా చేస్తున్నారు. శ్మశానాలనూ వదలడం లేదు. వీరి అకృత్యాలకు శవాలు సైతం ఘోషిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అనంతపురం రూరల్ మండలంలో టీడీపీ నాయకుల దూకుడు ఎక్కువగా ఉంది. ప్రభుత్వ భూములు, స్థలాలను భారీగా చెరబడుతున్నారు. తాజాగా శుక్రవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో శ్మశాన స్థల దురాక్రమణ వెలుగులోకి వచ్చింది. స్థానిక బీఎస్ఆర్ కాలనీ ఎదురుగా ఉన్న దళితుల శ్మశాన స్థలంపై కన్నేసిన 'తమ్ముళ్లు' .. జేసీబీసాయంతో చదును చేయించారు. దళితులు అడ్డుకునే ప్రయత్నం చేయగా..ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు పరిటాల సిద్ధార్థ్ పేరు చెప్పి భయపెట్టారు. 'అన్న చెప్పాడు..మేము చదును చేయిస్తున్నాం. ఏదైనా ఉంటే అన్నతోనే మాట్లాడుకోండి. తహసీల్దార్‌తోనూ అన్న మాట్లాడాడు. మీరు ఏమి చేసినా పనులు నిలబెట్టేది లేదు' అంటూ తెగేసి చెప్పారు. దీంతో దళితులు వెంటనే తహసీల్దార్ మోహన్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు.

2008లో రెండు ఎకరాల కేటాయింపు
దళితుల శ్మశాన వాటిక కోసం రాచానపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నంబరు 83–3లో రెండు ఎకరాల భూమిని 2008 సంవత్సరంలో ప్రభుత్వం కేటాయించింది. రాచానపల్లి నుంచి అక్కంపల్లికి వెళ్లే దారిలో రోడ్డుపక్కనే ఈ శ్మశాన వాటిక ఉంది. ఇప్పటికే ఇక్కడ పలువురి మృతదేహాలను ఖననం చేశారు. 70 దాకా సమాధులు వెలిశాయి. ఇంకా ఎకరం దాకా స్థలం ఖాళీగా ఉంది. దీన్ని టీడీపీ నాయకులు కబ్జా చేస్తున్నారు. అనంతపురం నగర శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ సెంటు స్థలం రూ.3 లక్షల దాకా పలుకుతోంది. తద్వారా సుమారు రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని కొట్టేయడానికి పూనుకున్నారు. పరిటాల సిద్ధార్థ్ పేరు చెబుతూ పట్టపగలే చదును చేయిస్తున్నారు.


శ్మశానంలోని సమాధులు


జేసీబీతో దళితుల శ్మశాన స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

తహసీల్దార్ మోహన్‌కుమార్ ఏమంటున్నారంటే..
''శ్మశాన భూములను సంరక్షించే బాధ్యత పంచాయతీ అధికారులదే. రాచానపల్లిలో దళితుల శ్మశాన స్థలాన్ని చదును చేయిస్తున్నారంటూ కొందరు నాకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడా. వీఆర్‌ఓతో కలసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పా. శ్మశాన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులదే. చదును చేసేందుకు నేను కూడా అనుమతి ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.''

క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం
దళితుల శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు చదును చేసినట్లు తెలిసింది. గ్రామసభ ఉండడంతో ఆవైపు వెళ్లలేదు. తహసీల్దార్ నుంచి ఫిర్యాదు లేఖ అందింది. శనివారం ఉదయం వీఆర్‌ఓ, సర్వేయర్‌తో కలసి శ్మశాన స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం. చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తాం. చదును చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. పంచాయతీ స్థలాల జోలికి ఎవరొచ్చినా ఉపేక్షించం.
– మహమ్మద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి, రాచానపల్లి

సత్యసాయి సేవలో కేంద్రమంత్రి మురుగన్


కేంద్ర మంత్రి మురుగన్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ శుక్రవారం సత్యసాయి సేవలో గడిపారు. శుక్రవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో పుట్టపర్తి చేరుకున్న ఆయన నేరుగా ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఘన స్వాగతం పలికారు. సాయంత్రం కేంద్ర మంత్రి డాక్టర్ మురుగన్ ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం తిరిగి బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ కార్యాలయంలో శనివారం జరగనుంది. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు సీఈఓ లక్కిరెడ్డిపల్లె వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ యాదవ్ సహా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారని వివరించారు.

క్లుప్తంగా

బిహారీ అనుమానాస్పద మృతి



కంటైనర్‌లో ఉన్న డ్రైవర్ మృతదేహం

యాడికి: పెద్దపప్పూరు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బిహార్‌కు చెందిన డ్రైవర్ అఖిలేష్‌కుమార్ రాయ్(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. తమిళనాడులోని హొసూరు నుంచి బిహార్‌కు కంటైనర్‌ను తీసుకెళుతున్న అఖిలేష్ కుమార్ గురువారం మధ్యాహ్నం గుత్తి అనంతపురం సమీపంలోకి చేరుకోగానే కంటైనర్ ఆగిపోయింది. అప్పటి నుంచి కంటైనర్ ఒకేచోట ఉండడంతో జీపీఎస్ ఆధారంగా విషయాన్ని గుర్తించిన యజమాని తన బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. డ్రైవర్ మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని విషయాన్ని చేరవేశారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి చిన్నాన్న కుమారుడు చందనకుమార్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్రిప్టో మాయ.. ప్రజల సొమ్ము పాయె

• ధర్మవరానికి చెందిన ఓ వ్యాపారి క్రిప్టో కరెన్సీ మోజులో పడ్డాడు. తొలుత భారీగా ఆదాయం వచ్చింది. దీంతో మరికొంత మందిని సభ్యత్వం చేయిస్తే మరింత లాభం వస్తుందని ఆశపడ్డాడు. బంధువులు, స్నేహితులు అందరితోనూ క్రిప్టో కరెన్సీ గురించి చెప్పి ఏకంగా రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించాడు. ఆ తర్వాత క్రిప్టో కరెన్సీ మోసం బట్టబయలైంది. ప్రస్తుతం రోజూ బెంగళూరులోని క్రిప్టో కరెన్సీ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లడం.. సాయంత్రానికి ధర్మవరానికి చేరుకోవడం నిత్య కృత్యమైంది. పెట్టిన డబ్బు ఇవ్వరు.. బంధువుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. బయటకు చెబితే అవమానం. క్రిప్టో కరెన్సీ మోజులో పడి మోసపోవద్దంటూ ఇప్పుడు ఆయన అందరినీ చైతన్య పరుస్తున్నాడు.

• అనంతపురం నగరానికి చేరుకున్న తెలంగాణకు చెందిన నాలుగు ఏజెన్సీలు క్రిప్టో కరెన్సీని భారత ప్రభుత్వం ఆమోదించిందని, కావాలంటే క్రిప్టో కరెన్సీ వెబ్‌సైట్ చూడండి అంటూ నమ్మబలుకుతున్నాయి. రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజూ 10 అమెరికన్ డాలర్లు వస్తాయని అంటున్నాయి. ఈ లెక్కన రోజూ రూ.800 ఆదాయం ఉంటుందని, ఇంతకంటే మంచి వ్యాపారం మరొకటి లేదంటూ నమ్మబలుకుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల సంఖ్యలో ఈ మాయలో చిక్కుకున్నారు.

• అనంతపురం నగరంలో బ్లాక్‌మనీ అధికంగా ఉండే వ్యాపారస్తులు ఓ వెబ్‌సైట్‌ను నమ్మి క్రిప్టో కరెన్సీలో రూ.15 కోట్ల దాకా పెట్టుబడి పెట్టారు. తొలుత బాగానే లాభాలు వచ్చాయి. వారం కిందట వెబ్‌సైట్ అప్‌డేట్ చేస్తున్నామని సమాచారం ఇచ్చి లింక్ తొలగించారు. దీంతో రోజూ వెబ్‌సైట్ చూసుకుంటున్నారు కానీ, ఎలాంటి ప్రగతి లేకపోవడంతో పాటు అడ్రస్ గల్లంతు కావడంతో తేలు కుట్టిన దొంగల్లా మారింది వారి పరిస్థితి.

.... ఇలా వీరు మాత్రమే కాదు... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా మంది అత్యాశపరులు క్రిప్టో కరెన్సీ మోజులో పడి విలవిల్లాడుతున్నారు.

• ఖాళీ అవుతున్న అత్యాశపరుల జేబు
• రూ.లక్ష కడితే రోజూ 10 అమెరికన్ డాలర్లు అంటూ మోసం
• వాట్సాప్ గ్రూపుల వేదికగా బరితెగిస్తున్న క్రిప్టో కేటుగాళ్లు
• ఇప్పటికే మోసపోయిన వందలాది మంది



అనంతపురం: రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఆకర్షిస్తోంది. డిజిటల్ కరెన్సీ క్రిప్టో పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. తమకు లాభాలు వచ్చాయని కొందరు చెబుతుంటే, చాలా మంది నష్టపోయినట్లు తెలుస్తోంది. పదుల సంఖ్యలో యాప్‌ల ద్వారా వ్యాపారం జరగడం, ఇందులో కొన్ని మూతబడినట్లు చెబుతుండటంతో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన మధ్య తరగతి ప్రజల ఇళ్లు గుల్ల కాగా, పోలీసుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ మాయా జూదం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తూనే ఉంది. మోసపోయిన వారిలో బడా వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులే అధికంగా ఉండడం గమనార్హం.

అనంతలోనూ దందా..

క్రిప్టో కరెన్సీ అనేది ఒక డిజిటల్ కరెన్సీ. ఇది ఏ దేశానికీ చెందదు. ఏ నియంత్రణ సంస్థ పరిధిలోకి రాదు. ప్రభుత్వ నియంత్రణ కానీ, బ్యాంకుల మధ్యవర్తిత్వం కానీ ఏవీ ఉండవు. ఇద్దరు వ్యక్తులు లేదా సంస్థల మధ్య నేరుగా బదిలీ చేసుకోగల డిజిటల్ కరెన్సీ మాత్రమే. దీనికి ఎలాంటి చట్టబద్ధత ఉండదు. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన కొందరు వ్యక్తులు అనంతపురం నగరంలో పాగా వేసి వందలాది మందిని క్రిప్టో ముగ్గులోకి లాగారు. రూ.లక్ష కడితే రోజూ అమెరికన్ డాలర్లు వస్తాయని నమ్మబలకడంతో ఉచ్చులోకి చిరు వ్యాపారులు, తక్కువ ఆదాయం ఉన్న వారు చిక్కుకున్నారు. ఇందుకు పెద్ద ఎత్తున వెలసిన వాట్సాప్ గ్రూపులే నిదర్శనం. ఇంత పెద్ద ఎత్తున దగా చేస్తున్నా.. నిఘా వ్యవస్థ నిద్రపోతోంది. ఈ తరహా మోసాలపై పోలీసులు కనీసం చైతన్య పరిచే పాపాన పోలేదంటే వ్యవస్థ పనితీరు ఎంత నిద్రావస్థలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సైబర్ విభాగాన్ని పటిష్టం చేస్తున్నాం

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ మోసాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అనుమానాస్పద వెబ్‌సైట్లు, అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాం. సైబర్ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తున్నాం.

– వల్లూరు శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ డీఎస్పీ

సాక్షి ఎడిటర్‌పై కేసు నమోదు దుర్మార్గం

• ఈరలక్కప్ప



మడకశిర: సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళిపై తప్పుడు కేసు నమోదు చేయడం చాలా దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తన కుట్రలకు చివరకు పాత్రికేయులను కూడా సీఎం చంద్రబాబు వదలడం లేదన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్న చంద్రబాబు... తాజాగా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పత్రికారంగాన్ని నిర్వీర్యం చేసేలా వర్ధెల్లి మురళిపై తప్పుడు కేసులు బనాయించి రాక్షసానందాన్ని పొందుతున్నారని ధ్వజమెత్తారు. విజయవాడలో వరద సాయం విషయంలో పెద్ద ఎత్తున చోటు చేసుకున్న అవినీతిని వెలుగులోకి తేవడం సాక్షి దినపత్రిక తప్పాఅని ప్రశ్నించారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలును రద్దు చేసుకుని ఎడిటర్ మురళిపై పెట్టిన తప్పుడు కేసును వెంటనే ఉపసహరించుకోవాలని హితవు పలికారు. లేకపోతే చంద్రబాబు పతనం ఖాయమని హెచ్చరించారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో తనిఖీలు



ఉపకేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న తనిఖీ బృందం సభ్యులు

నల్లచెరువు: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. పలు రికార్డులను బృందంలోని సభ్యులు పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్ర, స్టాటిస్టికల్ అధికారి కళాధర్, డీపీఓ నాగరాజు, డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, సుబ్బారావు, డాక్టర్ కల్పనారెడ్డి, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





గుప్త నిధి కోసం విగ్రహం పెకలింపు



అపరాధయ్యస్వామి బండను తొలగించిన ప్రాంతంలో గుమిగూడిన గ్రామస్తులు

బత్తలపల్లి: గుప్త నిధుల కోసం దేవుడి విగ్రహాన్ని పెకిలించి తవ్వకాలు సాగించిన ఘటన బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో కలకలం సృష్టించింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... అప్పరాచెరువు గ్రామానికి అర కిలోమీటరు దూరంలో చెరువు కట్ట కింద ఉన్న అపరాధయ్యస్వామి విగ్రహానికి పూర్వీకుల కాలం నుంచి గ్రామస్తులు పూజలు చేస్తున్నారు. అపరాధయ్యస్వామి వెలసిన బండ కింద అమూల్యమైన బంగారు నిధి నిక్షేపాలు ఉన్నట్లు స్థానికులు విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే రెండు, మూడు సార్లు గుప్తనిధిని వెలికి తీసేందుకు దుండగులు విఫలయత్నం చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామస్తులు ఎవరూ అటువైపుగా వెళ్లలేకపోయారు. దీనిని అదనుగా తీసుకుని గురువారం రాత్రి దుండగులు రెచ్చిపోయారు. ఏకంగా జేసీబీని ఏర్పాటు చేసి అపరాధయ్యస్వామి విగ్రహాన్ని పెకిలించేశారు. అనంతరం విగ్రహం కింద భారీ పరిమాణంలో ఉన్న రాతినీ తొలగించి ఏడు అడుగులకు పైగా లోతున తవ్వారు. తాంత్రిక పూజలు సాగించినట్లుగా అక్కడి ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. రహదారి వెంబడి మంత్రించిన కొర్రలను చల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా, రెండు, మూడు రోజులుగా కొత్త వ్యక్తులు కారులో సంచరిస్తూ ముందుగా రెక్కీ నిర్వహించినట్లుగా సమాచారం. విషయం తెలిసిన వెంటనే శుక్రవారం ఉదయం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులూ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎస్‌ఐ సోమశేఖర్ మాట్లాడుతూ... గుప్త నిధుల కోసం తవ్వకాలు సాగినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో మరింత లోతైన విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య



మృతురాలు సువర్ణమ్మ

గుడిబండ: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం మల్లసంద్ర గ్రామానికి చెందిన సువర్ణమ్మ (67), నారాయణాచారి దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరేళ్ల క్రితం గుడిబండకు వలస వచ్చిన వారు స్థానిక రాజు కాలనీలో నివాసముంటూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సువర్ణమ్మకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రోజూ వారీగా కూలి పనులకు కుమారుడు వెళుతూ తల్లికి చెప్పేందుకు గది తలుపు తీయగా ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో గట్టిగా కేకలు వేశాడు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని ఉరికి వేలాడుతున్న సువర్ణమ్మను కిందికి దించి చూశారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

'అనంత' కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా యుగేశ్వరి

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దారు యుగేశ్వరిదేవి స్థానిక కలెక్టరేట్‌లోని కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.



కాలుష్యాన్ని తగ్గించే ఆవిష్కరణలు రావాలి



సదస్సులో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: మానవాళికి సవాలుగా మారిన వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే సరికొత్త ఆవిష్కరణల వైపు పరిశోధన విద్యార్థులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూఏలోని కెమికల్ విభాగంలో మూడు రోజులుగా సాగుతున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. 'మెంబరెన్ ప్రాసెస్, ఫర్ ఏ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ ' అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో కాలుష్య నివారణకు చేపట్టాల్సిన అంశాలపై దృష్టి కేంద్రీకరించడం సంతోషదాయకమన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా మెంబరిన్ టెక్నాలజీ పాత్ర ప్రశంసనీయమన్నారు. గ్లోబల్ వార్మింగ్‌లో కర్బన ఉద్గారాలు తగ్గించడానికి ప్రపంచ దేశాలు బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణే మన ముందు ఉన్న ప్రధాన కర్తవ్యం అనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇలాంటి వినూత్న అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎన్వీ సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, సదస్సు కో-కన్వీనర్ డాక్టర్ బి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆప్టా' రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రేపు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) 2వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈ నెల 20న అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఆప్టా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సంఘం బాధ్యులు సమావేశానికి హాజరై, విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలి

• పాఠశాల విద్య ఆర్జేడీకి ఎస్టీయూ నాయకుల వినతి



ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మునిసిపల్ టీచర్ల సీనియార్టీ, జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలను డీఎస్సీల వారీగా సిద్ధం చేసి విడుదల చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను పాత డీఈఓ కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ జి.కిషోర్ ఉన్నారు.

